క్లుప్తంగా

దేవరాజు గోపాలకృష్ణ చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న స్వప్న హైందవి

విజయనగరం టౌన్: వివిధ సాహితీ సంస్థల ద్వారా విశేషమైన సేవలందించిన దేవరాజు గోపాలకృష్ణ చిరస్మరణీయుడని వాగ్దేవి సమారాధనం సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి అన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేట బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవన్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దేవరాజు గోపాలకృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యలనగరమైన విజయనగరంలో వివిధ సాహితీ సంస్థలు, సంగీత, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా సంఘాలకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ధవళ సర్వేశ్వరరావు, రొంగలి పోతన్న , వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు

డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో ప్రతిభ కనకన బరిచిన క్రీడాకారులను మండలంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో అక్కివరం సచివాలయం పరిధిలోని క్రీడాకారులు విన్నర్‌గా నిలిచారు. వాలీబాల్ పోటీలో గుణుపూరుపేట సచివాలయం పరిధిలోని క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. అలాగే కబడ్డీలో డెంకాడ సచివాలయ పరిధిలోని క్రీడాకారులు ద్వితీయ స్థానం.. క్రికెట్‌లో మోపాడ జట్టు తృతీయస్థానం సాధించారు. దీంతో క్రీడాకారులను ఆదివారం ప్రత్యేకంగా మండల కేంద్రంలో అభినందించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



తహసీల్దార్, ఎంపీడీఓలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలో విలువైన సేవలు అందించి ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణిలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



హోరాహోరీగా కబడ్డీ పోటీలు

శృంగవరపుకోట: పట్టణంలోని డాక్టర్ వరలక్ష్మి సీబీఎస్ఇ స్కూల్ క్రీడా మైదానంలో 'ఆడుదాం -ఆంధ్రా' నియోజకవర్గస్థాయి కబడ్డీ ఫైనల్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ఈపోటీల్లో ఎస్.కోట జట్టు విజేతగా నిలిచింది. ఎల్.కోట జట్టు ద్వితీయ స్థానం, కొత్తవలస జట్టు తృతీయస్థానాలు సాధించాయని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీరాములు తెలిపారు.

బల్లంకిలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీలను తిలకిస్తున్న ప్రజలు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో వల్లంపూడి సిద్ధివినాయక ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎద్దులు, తృతీయ స్థానంలో లక్కవరానికి చెందిన బాలబోయిన మహేష్ ఎద్దులు, నాలుగోస్థానంలో వావిలపాడుకు చెందిన గండివెంకటరావు ఎద్దులు, అయిదో స్థానంలో దేవరపల్లికి చెందిన జై వీరాంజనేయ ఎద్దులు నిలిచాయి. విజేతలకు సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, నాయకులు కనకరాజు, ఉపసర్పంచ్ ధనుంజయ్, వార్డుమెంబర్లు గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేసి మహిళలను ఆర్థికంగా ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి అనేక పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా ఆదుకుంటూ, వారి స్వయం ఉపాధికి బాటలు వేశారని కొనియాడారు. ఇంతటి సంక్షేమ పాలన అందించి మహిళలను ఆదుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడిత కింద ప్రభుత్వం రూ.11.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. నాలుగు విడతలు కలిపి రూ.44.40 కోట్లు లబ్ధిదారులకు అందిందని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే రైతులకు.. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా రోగలకు సేవలందించడంతో పాటు నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు ఇంటివద్దనే పింఛన్లు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ, జనసేన కలిసి వచ్చినా జగన్ మోహన్‌రెడ్డి విజయాన్ని అడ్డుకోలేరని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పీడీ కల్యాణచక్రవర్తి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, ఏపీఎంలు రాజ్యలక్ష్మి, సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ విభాగాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

టైలరింగ్‌తో ఉపాధి..



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం తనలాంటి ఎంతోమంది మహిళలను ఆదుకుంటోంది. మా సంఘానికి రూ.5 లక్షలు ఆసరా కింద మంజూరు కాగా.. నాకు రూ. 50 వేలు వచ్చాయి. దీంతో కుట్టుమిషన్ కొనుగోలు చేసి కుటుబాన్ని నెట్టుకొస్తున్నాను. ఉపాధి కల్పించిన జగనన్న మేలు మరువలేను. - మామిడి లక్ష్మి, పొదుపు సంఘం మహిళ, గొడిపాలెం.

ఎంతో సంక్షేమం..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆసరా ద్వారా నాకు రూ. 48 వేలు మంజూరు కాగా టైలరింగ్ చేసుకుంటున్నాను. అలాగే అమ్మఒడి మంజూరైంది. మా అత్తకు ప్రతి నెలా పింఛన్ వస్తోంది. సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు ధన్యవాదాలు. - పిల్లా భాగ్యలక్ష్మి, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు, రఘుమండ

రూపురేఖలు మారాయి..



నాడు: అభివృద్ధికి నోచుకోని కస్పా స్కూల్



నేడు: సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాల

గతంలో ఎంతో అధ్వానంగా ఉండే నగర పాలక ఉన్నత పాఠశాల (కస్పా) రూపురేఖలు మారాయి. అప్పటి టీడీపీ పాలకులు పాఠశాలల అభివృద్ధికి కనీస చర్యలు కూడా తీసుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరాక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 'మనబడి నాడు - నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అదనపు భవనాలు నిర్మించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. ఈ క్రమంలో కస్పా పాఠశాల అభివృద్ధి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఆసరా సంబరాలను విజయవంతం చేయండి

● వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లిమర్ల: ఈ నెల 30న నిర్వహించనున్న ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, నెల్లిమర్ల పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు కోరారు. సంబరాల నిర్వహణ కోసం స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, తదితరులతో కలిసి ఆదివారం వారు పరిశీలించారు. రుణమాఫీ పొందిన మహిళలంతా సంబరాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దన్నకు ఘనంగా నివాళులు..



పెద్దన్న సంస్మరణ సభలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు రెడ్డి నారాయణరావు

విజయనగరం టౌన్: నిరుపేదల గొంతు పెద్దన్న ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని, ఆయన అకాల మృతి ఏఐఎఫ్‌టీయూ (న్యూ)కి తీరని లోటని విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి నారాయణరావు అన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూ పార్కు వద్ద ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్ష్యుడు, కేంద్ర కార్యవర్గ సభ్యుడు సి.పెద్దన్న సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా పెద్దన్న చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ, ఆటో, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం ఉద్యమించారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. పెద్దన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎన్. అప్పలరాజురెడ్డి, బి.శంకరరావు, ఎం. అప్పలరాజు, బి.సన్యాసిరావు, ధరమ, కనకరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న రఘువర్మ, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, తదితరులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మాతృమూర్తి మంగమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు ఆదివారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయానికి వచ్చి పరామర్శించారు. ఎమ్మెల్సీ రఘువర్మ, సాలూరు మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, తదితరులు మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జానపదం సజీవం



బద్రి కూర్మారావు దంపతులను సత్కరిస్తున్న విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: జానపద వాఙ్మయమనేది ఎప్పటికీ సజీవంగా ఉంటుందని గిడుగు రామమూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో జానపద సాహితీ సౌరభం కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వక్తగా హాజరైన ఆయన జానపథంలో జానపద సాహిత్యం అనే అంశంపై మాట్లాడుతూ, ఆచార్య వెలమల సిమ్మన్న చెప్పినట్లు మానవ వికాసం ప్రాథమిక దశలోనే జానపద వికాసం ప్రారంభమైందన్నారు. అనంతరం కూర్మారావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. గోపాలరావు, కొంకె పూడి అనురాధ, వారణాసి వెంకట నరసింహమూర్తి , దశగ్రంధాల వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు బాబూజీ, సూర్యలక్ష్మి, దామరాజు శంకరం, డాక్టర్ శ్రీకాంత్ సోమేశ్వరరావు, రాఘవరావు, జీఎస్.చలం, రత్నాల బాలకృష్ణ, సంతోష లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సారిక.. సాటిలేదిక..

- వైఎస్సార్‌సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి
- రూ. 1.32 కోట్లతో భవన నిర్మాణాలు
- రూ. 82 లక్షలతో బీటీ, సీసీ రోడ్లు
- రూ. 46 లక్షలతో కాలువలు, ప్రహరీల నిర్మాణం
- కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల
- సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందజేసినది రూ.10.54 కోట్లు
- పరోక్ష ప్రయోజనం కింద రూ. 4.44 కోట్లు



రూ. 40 లక్షలతో నిర్మించిన సారిక గ్రామ సచివాలయం

ఊరు మారింది

విజయనగరం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. సంక్షేమం... అభివృద్ధే తన మంత్రమని చెబుతూ రాష్ట్రాభివృద్ధి కోసం అడుగులేస్తున్నారు. నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో గ్రామాల రూపురేఖలు మారి ఆదర్శంగా నిలుస్తున్నాయి. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల చెంతకే సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అలాగే పేద వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను నిజం చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. పార్టీలకతీతంగా, అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నిధులను మళ్లిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని ప్రజలు చెబుతున్నారు. విజయనగరం మండలం సారిక గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రూ. 1.32 కోట్లతో భవన నిర్మాణాలు..

గ్రామంలో రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించగగా, రూ. 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మించారు. 24 గంటలు ఇంటింటికీ వైద్యం అందించాలనే ఆశయంతో రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మిస్తుండగా, రైతుల ప్రయోజనాలను కాంక్షిస్తూ రూ. 48.5 లక్షలతో అగ్రిల్యాబ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

మెరుగైన రహదారులు

గ్రామంలో ఎటువైపు చూసినా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు కనిపిస్తాయి. గ్రామానికి నలువైపుల నుంచి వచ్చే రహదారులను రూ. 62 లక్షలతో బీటీ రోడ్లుగా మార్చారు. అలాగే రూ. 25 లక్షలతో పలు సీసీ రోడ్లు నిర్మించారు.

భూగర్భ డ్రైనేజీ..

గ్రామంలో అనేక వీధుల్లో రూ. 33 లక్షలతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీ, ప్రభుత్వ భవనాల చుట్టూ రూ. 13 లక్షలతో ప్రహరీలు నిర్మించారు.

పేదల సంక్షేమానికి రూ. 14.98 కోట్లు

కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసిన గత తెలుగుదేశం ప్రభుత్వానికి గట్టి జవాబు చెప్పేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో సారిక సచివాలయ పరిధిలోని ప్రజల సంక్షేమానికి రూ. 14.98 కోట్లు కేటాయించింది. వైఎస్సార్ పింఛను కానుకకు రూ. 3.44 కోట్లు అందించగా, గృహ నిర్మాణాలకు రూ. 1.25 కోట్లు, వైఎస్సార్ రైతుభరోసాకు రూ. 1.21 కోట్లు, జగనన్న అమ్మఒడి పథకానికి రూ. 1.17 కోట్లు, వైఎస్సార్ ఆసరాకు రూ. 1.05 కోట్లు, ఇతర పథకాలకు మరో రూ. 6 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసింది. అలాగే 2019 వరకు అథోగతిలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నాడు- నేడు పథకంలో భాగంగా లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేసి పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.



రూ. 48.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రిల్యాబ్



గ్రామంలో విశాలంగా నిర్మించిన సీసీ రోడ్లు



కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దిన ఎంపీయూపీ పాఠశాల



గ్రామానికి వచ్చే బీటీ రోడ్డు

గ్రామాభివృద్ధికి రూ. 18 కోట్లు



ముఖ్యమంత్రి ఆశయానికి తోడు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి ఫలితంగా గ్రామాభివృద్ధికి నాలుగున్నరేళ్లలో సుమారు రూ. 18 కోట్ల నిధులను మంజూరు చేశారు. గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. - మామిడి అప్పలనాయుడు, ఎంపీపీ, విజయనగరం

సంతోషంగా జీవిస్తున్నాం..



గతంలో గ్రామంలో బతకలేక జిల్లా కేంద్రానికి వలస వెళ్లి, పనులు చేసుకుంటూ జీవించే వారం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత మా తలరాత మారింది. మాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. అలాగే వైఎస్సార్ ఆసరా, చేయూత పథకం కింద రూ. 18,750, మా అత్తకు పింఛను, మా పిల్లలకు అమ్మఒడి పథకం వస్తోంది. దీంతో పిల్లలను మంచిగా చదివించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన అండతో సొంత ఊళ్లోనే కూరగాయలు వ్యాపారం చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాం. - సారిక సత్యవతి, లబ్ధిదారు, సారిక గ్రామం